

బంజారాహిల్స్ రోడ్డు నం:14లోని ఓల్డ్ వెంకటేశ్వరనగర్‌లో ఓటేసిన ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

## ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

### ఓల్డ్ సిటీలో స్వల్ప ఉద్రిక్తతలు - లాఠీ ఛార్జీ



సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్ర రాజధాని నగరంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద కేంద్ర బలగాలను మోహరించారు. కాంగ్రెస్, ఎంఐఎం, ఎంబీటీల మధ్య ఓల్డ్ సిటీలో అక్కడక్కడ ఘర్షణలు జరిగాయి. రాచకొండలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య స్వల్ప ఘర్షణలు చోటు చేసుకోగా, మిగతా అన్ని ప్రాంతాలలో ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల సరళిని హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు సందీప్ శాండిల్యా, డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్రలు పరిశీలించారు. ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసులు పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేశారు. సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఎలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం, ఘటన జరుగగానే వెంటనే అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏదైనా ఘటన జరిగితే వెంటనే స్పందించి ఎక్కడకిక్కడే ఉద్రిక్తతలను నిలువరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఘర్షణకు దిగడంతో పోలీసులు లాఠీఛార్జీ చేసి చెదరగొట్టారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడు సలీంపై ఎంఐఎం నాయకులు దాడి చేశారు. ఓటా బజార్‌లోని ఓపియన్ పబ్లిక్ స్కూల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించడానికి వెళ్లిన సలీంతో అక్కడ ఉన్న ఎంఐఎం కార్యకర్తలు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ జరిగింది. దీంతో ఒకరికి గాయాలయ్యాయి. మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌పై ఎంఐఎం పార్టీ నాయకులు దాడికి దిగడంతో సైదాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. జాకీర్ హుస్సేన్ కాలనీలో పోలింగ్ బూత్‌ను పరిశీలించడానికి వెళ్లిన సమయంలో ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై అక్బర్ సైదాబాద్ పోలీసులకు పిర్యాదు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మణికొండలోని పోలింగ్ సెంటర్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులకు వివాదం జరిగింది. అక్కడక్కడా జరిగిన వివాదాలు, స్వల్ప ఘర్షణలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.



కంటోన్మెంట్ గీతాంజలి పాఠశాల వద్ద బారులు తీరిన ఓటర్లు



సీసీ టీవీల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర, తదితరులు



పోలింగ్ కేంద్రాలను పరిశీలనలో సీపీ స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు

# సైబరాబాద్‌లో ప్రశాంతంగా పోలింగ్

### సుడిగాలి పర్యటన చేసిన సీపీ స్టీఫెన్

సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని 13 నియోజకవర్గాలలో గురువారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ చాలా చోట్ల సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది. ఐదు గంటల్లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 3,202 పోలింగ్ స్టేషన్‌లలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కమిషనరేట్ పరిధిలో 655 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ (పీఎస్ఐఓసీ) నుంచి కమిషనరేట్ పరిధిలో జరిగిన ఎన్నికల తీరును, పోలింగ్ కేంద్రాల వద్దనున్న క్యూఆర్‌టీ వాహనాలకు అమర్చిన జీఐఎస్ వ్యవస్థ నుంచి రియల్ టైమ్ లొకేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించారు.

**సుడిగాలి పర్యటన..**

గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాసరావు, సందీప్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి బాలానగర్ జోన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ, కుత్బుల్లాపూర్, నిజాంపేట, హఫీజ్‌పేట్, జగద్గిరిగుట్ట, జీడిమెట్లలోని పలు పోలింగ్ కేంద్రాలు, మాదాపూర్ జోన్ పరిధిలోని మలేషియన్ టౌన్‌షిప్, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి తాండ తదితర ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేసి, అక్కడ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం, రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని సిక్‌చావనిలోని గురునానక్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం, హాసన్‌నగర్‌లోని లఖీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలను సీపీ సందర్శించి, అక్కడి పోలింగ్ సరళిని పరిశీలించారు.

# అదే తీరు.. మారని గ్రేటర్ ఓటరు



సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): గురువారం జరిగిన శాసన సభ ఎన్నికలను గత ఎన్నికలతో పోల్చుకుంటే నగర ఓటర్లలో పెద్దగా మార్పు కన్పించడం లేదు. తీరు మారని ఓటరు సెలవు దినాన్ని ఎంజాయ్ చేస్తూ ఇళ్లకే పరిమితమయ్యారు. మొత్తం ఓటర్లతో పోల్చితే పోలింగ్ కేంద్రాలకు వచ్చే సంఖ్య గణనీయంగా తగ్గింది. తెలంగాణలో మూడుసార్లు జరిగిన ఓటింగ్ సరళిని గమనిస్తే గ్రేటర్ చుట్టూరా ఉన్న జిల్లాల్లోనే తక్కువగా ఉండగా, తాజా గ్రేటర్‌లో ఓటింగ్ 49.03 శాతం ఉంది. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 46.56, రంగారెడ్డి జిల్లా పరిధిలో 59.94, మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 56 శాతం ఓటింగ్ నమోదైంది.

**మార్పు రావడం లేదు..**

గ్రేటర్ వ్యాప్తంగా నమోదైతున్న ఓటింగ్ సరళిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్నా హైదరాబాద్‌లోనే ఓటు వేసేందుకు గడప దాటడం లేదు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండగా, గతంలో అతి తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాలపై మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉంటుందే.. కానీ, పోలింగ్ రోజున ఆ ఓటు వినియోగంలోకి రావడం లేదు. కోర్ సిటీతో పాటు, హైదరాబాద్ చుట్టూరా ఉన్న అన్ని జిల్లాల్లోనూ ఇదే తరహా ట్రెండ్ నడుస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.

**పెరగని ఓటింగ్ శాతం**

2014 నుంచి ఇదీ మూడో ఎన్నిక. 2014, 2018లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2019లో జీహెచ్ఎంసీ, 2019 లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఓటింగ్ సరళిని గమనిస్తే... ప్రతి ఎన్నికల్లోనూ పెద్ద మార్పు ఉండటం లేదు. సగటున 55 శాతం లోపే ఓటింగ్ నమోదు కావడం పలు నియోజకవర్గాల్లో సర్వసాధారణంగా మారింది. హైదరాబాద్ జిల్లాల్లో మొత్తం 15 నియోజకవర్గాలు ఉండగా, 2014లో సగటున 51.5 శాతం, 2018లో 50.3 శాతం మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**గతం కంటే.. తగ్గిన ఓటింగ్**

హైదరాబాద్ చుట్టూరా ఉన్న రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వారీ ఓటింగ్ సరళిని పరిశీలిస్తే... 2018 కంటే గణనీయంగా తగ్గింది. సాయంత్రం ఐదున్నర గంటల వరకు విడుదల చేసిన జాబితా ప్రకారం 23 నియోజకవర్గాల సగటు గతం కంటే 10-15 శాతం తక్కువగా నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా ఓటరు గడప దాటకపోవడంతో చివరి వరకు కూడా ఓటింగ్ శాతం ఏమాత్రం పెరగడం లేదు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈసారి తక్కువ ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం ఎన్నికల అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

*గ్రేటర్ వ్యాప్తంగా 49.03 శాతం దాటని ఓటింగ్*

*పలు నియోజకవర్గాల్లో గతం కంటే దారుణంగా పడిపోయిన ఓటింగ్*

| నియోజకవర్గం | 2014 | 2018 | 2023 |
|---|---|---|---|
| **హైదరాబాద్ జిల్లా** | | | |
| ముషీరాబాద్ | 54.4 | 52.8 | 49.61 |
| అంబర్‌పేట్ | 54.9 | 55.7 | 50.52 |
| ఖైరతాబాద్ | 53.0 | 53.7 | 51.31 |
| జూబ్లీహిల్స్ | 49.9 | 45.6 | 45.20 |
| సనత్ నగర్ | 52.4 | 52.3 | 50.74 |
| సికింద్రాబాద్ | 56.6 | 55.4 | 49.60 |
| కంటోన్మెంట్ | 49.8 | 49.1 | 49.40 |
| గోషామహల్ | 55.0 | 58.7 | 54.93 |
| కార్వాన్ | 55.4 | 52.7 | 46.50 |
| నాంపల్లి | 47.9 | 45.5 | 42.76 |
| మలక్‌పేట్ | 47.4 | 42.4 | 41.00 |
| యాకుత్‌పురా | 51.1 | 42.6 | 39.69 |
| చార్మినార్ | 55.7 | 50.3 | 41.45 |
| బహుదూర్‌పురా | 55.3 | 50.4 | 44.86 |
| చాంద్రాయణగుట్ట | 51.4 | 47.8 | 45.00 |
| **రంగారెడ్డి** | | | |
| ఎల్బీ నగర్ | 46.9 | 49.6 | 49.11 |
| శేరిలింగంపల్లి | 47.5 | 48.6 | 48.85 |
| రాజేంద్రనగర్ | 58.9 | 56.9 | 55.83 |
| ఇబ్రహీంపట్నం | 78.4 | 76.4 | 74.80 |
| చేవెళ్ల | 78.4 | 79.3 | 74.25 |
| షాద్ నగర్ | 79.8 | 88.1 | 81.96 |
| మహేశ్వరం | 53.6 | 55.3 | 55.33 |
| కల్వకుర్తి | 53.6 | 55.3 | 83.23 |
| **మేడ్చల్** | | | |
| కూకట్‌పల్లి | 49.1 | 57.8 | 53.96 |
| ఉప్పల్ | 49.3 | 51.7 | 51.35 |
| కుత్బుల్లాపూర్ | 48.1 | 56.1 | 56.74 |
| మేడ్చల్ | 60.6 | 60.7 | 62.09 |
| మల్కాజిగిరి | 51.2 | 53.2 | 53.99 |